
# బంధాలు - అనుబంధాలు

కథ



భాగవతుల రమాదేవి

సాయంత్రం ఐదు గంటలు కావస్తున్నది. ఎండకాలం కావడం వల్ల వేడి తీవ్రత ఇంకా తగ్గలేదు. కరెంటు కోత కూడా ఉండటం వలన ఫ్యానులు గాని, ఎ.సి.లు గాని పని చెయ్యటం లేదు. మధ్యాహ్నం మూడు గంటల నుండి నిద్ర పోవడం కోసం అవస్థలు పడుతూనే ఉంది భారతి.

ఆ సమయంలో 'అమ్మా! ఇప్పుడు నిద్రపోతున్నావేంటి! చూడు నీ కోసం ఏం తెచ్చానో?' అన్న కొడుకు మాటలకి వెనుతిరిగి చూసింది భారతి.

ఎదురుగా కొడుకు ఆదిత్యతో పాటు మరో అమ్మాయి కూడా నిల్చొని ఉంది, మెళ్లో పూల దండలతో.

'సారీ అమ్మా, ముందుగా చెప్తే నువ్వు బాధ పడతావని చెప్పలేదు. నేనూ, కీర్తీ, రిజిస్టరు పెళ్లి చేసుకున్నాం. అక్కడ నుండి సరాసరి నీ దగ్గరకే వచ్చాం. మరి మమ్మల్ని ఆశీర్వదించమ్మా' గబ గబ చెప్పుకుపోతున్న ఆదిత్య మాటలకి, భారతి మంచం మీద నుండి కూడా దిగకుండా, ఆశ్చర్యంగా అలానే కూర్చుండిపోయింది.

పక్కగదిలో ఉన్న రావుగారు కొడుకు మాటలు విని బయటకు వచ్చి పరిస్థితిని అర్థం చేసుకున్నారు.

'అదేంటి భారతీ, అలా అక్కడే కూర్చుండిపోయేవేంటి? లేచి వాళ్లనిద్దరినీ ఆశీర్వదించు' అన్న భర్త మాటలకి తేరుకొని, ఇద్దరిని దగ్గరగా తీసుకుంది.

'క్షమించమ్మా!' మరోసారి క్షమాపణ కోరుకున్నాడు ఆదిత్య.

'దానికేముంది ఆదిత్యా, నీకు ఇష్టమైన అమ్మాయిని నువ్వు పెళ్లి చేసుకున్నావు. కాని ముందుగా మాకు ఈ పెళ్లి విషయం చెప్పి ఉండాల్సింది. నీ ఇష్టాన్ని మేము ఎప్పుడైనా కాదన్నామా? ఎవరూ లేనట్టు నువ్వు ఒక్కడివే వెళ్లి నీ పెళ్లిని ఇలా చేసుకోవడం నాకు బాధగా ఉంది నాన్నా!' వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ మెల్లిగా అంది భారతి.

'చూడు భారతీ! ఏదో అయింది. వాళ్లు సంతోషంగా ఉన్నప్పుడు నువ్వు ఇలా మాట్లాడటం ఏమిటి? వాళ్లని లోపలకి తీసుకొని వెళ్లు!' మరోసారి హెచ్చరించారు రావుగారు.

'నిజమే, లోపలకి పదండి, ఇప్పుడు నీకు నేను సారీ చెప్తున్నానమ్మా, నీ పేరు కూడా అడగకుండా ఇలా నిల్చోబెట్టి మాట్లాడుతున్నందుకు' భారతి కోడల్ని దగ్గరికి తీసుకుంటూ అడిగింది.

'పరవాలేదు ఆంటీ, నా పేరు కీర్తి. మీ గురించి, అంకుల్ గురించి, మీ అమ్మాయి దీప్తి గురించి ఆదిత్య చెప్తూ ఉంటాడు' చెప్పింది కీర్తి.

ఆ సంతోషంలోనే బొంబాయికి ఫోను చేసి కూతురు దీప్తిని వెంటనే ఫ్లైట్‌లో రమ్మనమని చెప్పింది భారతి.

'సరే అమ్మా! నువ్వు, నాన్నగారు అర్జంటుగా తయారవండి. కీర్తీ వాళ్ల నాన్నగారు ఈ రోజు రాత్రి పార్టీ ఇస్తున్నారు. ఈ రోజు మనమంతా అక్కడే డిన్నరు చేద్దాం' చెప్పేడు ఆదిత్య.

మరోసారి ఆశ్చర్యపోయింది భారతి, ఇంతకు ముందుగానే అన్నీ ప్లాను చేసుకొని తనతో మాత్రం ఏమీ చెప్పనందుకు.

'లేదు ఆదిత్యా, నాకు జ్వరంగా ఉంది, నువ్వు, కీర్తీ వెళ్లి రండి. నాన్నగారిని అడిగి ఆయన వస్తానంటే తీసుకెళ్లండి.' జ్వరం నెపంతో తప్పించుకుంది భారతి.

'లేదు ఆదిత్యా, అమ్మని ఒక్కర్తినే వదిలిపెట్టి నేను రాలేను మీరిద్దరూ వెళ్లి రండి.' రావుగారు కూడా తప్పించుకున్నారు.

'సరే అమ్మా! రాత్రి అయిపోయింది. మాకు లేటు అయిపోతున్నది. నీ తరపున నేను కీర్తీ వాళ్ల నాన్నగారికి సారీ చెప్తానులే. నీ ఒంట్లో జాగ్రత్త. రేపు ఏదో ఒక టైములో వస్తాం. మా కోసం

ఎదురుచూడకండి.'

హడావుడిగా వెళ్లిపోతున్న కొడుకుని చూసి నిజంగా 104 డిగ్రీల జ్వరం వచ్చినదానిలా పడిపోయింది భారతి.


'పోనీలే భారతీ! ఎల్లుండి మనింట్లో వ్రతం చేసుకొని అందర్నీ పిలుచుకుందాం. అమ్మాయి రేపు వస్తుంది కదా! నీకు సాయంగా ఉంటుంది. నేను బయట ఏర్పాట్లు అన్నీ చేస్తాను. చిన్నవాళ్లతో మనం సర్దుకుపోవాలి. ఇది నీ దృష్టిలో పెద్ద విషయంగా కనిపించవచ్చు. వాడు అలా ఆలోచించటం లేదు. వాళ్లు సుఖంగా ఉంటేనే మనం ఆనందంగా ఉండగలం. ఇంత వరకు వాడు చెప్పిన 'సారీ' లన్నింటికి 'సరే' అన్నావు. ఇది కూడా అలాగే అనుకో. కోడలు వచ్చిందని నీకు కడుపు నిండిపోయిందేమో! నాకు ఆకలి వేస్తున్నది. టిఫిను చెయ్యి.' మాట మార్చి మెల్లగా భార్యను వంటింట్లోకి పంపించేరు రావుగారు.

మర్నాడు వచ్చిన కూతురుతో మళ్లీ మరోసారి అన్నీ చెప్పుకొని బాధపడింది భారతి.

'పోనీ అమ్మా! నీ కోరికలన్నీ నేను తీర్చేను కదా! నువ్వు చెప్పిన అత్తకొడుకునే పెళ్లి చేసుకున్నాను. మీ కోసం మేమిద్దరం ఇండియాలో ఉన్నాం. అన్నయ్య పెళ్లి చేసుకొని వదిన్ని ఇంటికే కదా తీసుకువచ్చేడు. రేపు వ్రతానికి అన్నీ రెడీ చేసుకొని, అందరి ముందూ సంతోషంగా ఉండు' తల్లిని ఓదార్చింది దీప్తి.

మర్నాడు వ్రతం గురించి ఫోనులో ముందు రోజు చెప్పినప్పుడు, 'మళ్లీ అందర్నీ పిలవడం, హడావుడి ఎందుకమ్మా! నీ ఒంట్లో కూడా బాగోలేదు కదా' అన్న ఆదిత్య మాటలకు, 'నీ పెళ్లి అయితే వ్రతం చేసుకుందామని మొక్కుకుంది మీ అమ్మ' అని రావుగారు సర్ది చెప్పేరు.

వ్రతానికి రెండు గంటల ముందు కీర్తి, వాళ్ల అమ్మానాన్నలతో కలసి వచ్చింది. భారతి వాళ్లని పలకరించి అర్జంటుగా తయారు అవమని కోడలుతో చెప్పింది.



అత్తగారు ఇచ్చిన పట్టుచీర, డైమెండ్ సెట్టు చూసి గాభరాగా మొహం పెట్టింది కీర్తి. 'అబ్బా! ఆంటీ, అసలే వేసవి కాలం. ఇవన్నిటినీ వేసుకోలేను. చీర అసలు నాకు అలవాటు లేదు కూడా. అయినా డ్రెస్సులో పూజ చేస్తే మీ దేవుడు ఏమీ అనడు కదా ఆంటీ?' కీర్తి మాటలు పూర్తి కాకముందే దీప్తి వచ్చి, వదిన్ని పక్క గదిలోకి తీసుకువెళ్లిపోయింది.

చీర కట్టుకొని బయటికి వచ్చిన కోడలి మొహంలో, ముందు వున్న ఉత్సాహం లేకపోవడం గమనించింది భారతి. వ్రతం పేరుతో కొంతమందినైనా పిలుచుకొని భార్య కోరిన సగం తీరినందుకు సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు రావుగారు.

ఉన్న ఊర్లోనే కొడుకూ, కోడలూ ఉద్యోగం చేసుకుంటున్నా, వారం రోజుల్లో నాలుగు రోజులు కోడలు పుట్టింట్లోనే ఉండేది.

'అక్కడ నుండి ఆఫీసు దగ్గర కదమ్మా, అందుకే తను అక్కడ ఉంటోంది' అనేవాడు ఆదిత్య.

కోడలికి నెల తప్పిందని ఆదిత్య చెప్పినప్పుడు మళ్లీ భారతిలో మునుపటి ఉత్సాహం వచ్చింది. తొమ్మిది నెలల కోసం ఆశగా ఎదురుచూసేది. చివరికి ఆ రోజు వచ్చి, మనవడు పుట్టేడన్న వార్త విని భారతి ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

ఆపరేషన్ చేశారనీ, రెస్టు కోసం ఆరు నెలలు పుట్టింట్లోనే ఉంచి, ఆ తరువాత బాబుని, కీర్తినీ ఇంటికి తీసుకువచ్చేడు ఆదిత్య.

తన సర్వస్వం మనవడే అనుకొని రోజులో చాలా భాగం వాడితోనే గడిపే భార్యను చూసి, సంతోషపడేవారు రావుగారు.

కాని ఈ ముచ్చటా మూడు నాళ్ల ముచ్చటగా మిగిలింది భారతికి.

ఒక రోజు ఆదిత్య వచ్చి 'అమ్మా నేనూ, కీర్తీ అమెరికా వెళ్లిపోతున్నామమ్మా! మరో పది రోజుల్లో వెళ్లిపోవాలి. టైము ఎక్కువ లేదు. అన్ని పనులూ ఈ లోపులే చెయ్యాలి' హడావుడిగా చెప్పేడు.

హఠాత్తుగా కొడుకు చెప్పిన మాట విని, నిర్ఘాంతపోయింది భారతి. ఈ వయస్సులో తమ గురించి ఆలోచించకుండా, తమతో ఒక్క మాట కూడా చెప్పకుండా నిర్ణయం తీసుకున్న కొడుకుని చూస్తూ ఉండిపోయింది. బాబుని వదిలి ఎలా ఉండగలదు? అన్న ఆలోచనే భరించరానిదిగా ఉంది.

'నువ్వు ఇలా దిగులుగా కూర్చోకు అమ్మా! నువ్వూ, నాన్నగారూ చదువుకున్నవారు. మా భవిష్యత్తును గురించి ఆలోచించండి. దీప్తి ఇండియాలోనే ఉంది. తను వస్తూ ఉంటుంది. మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు నా దగ్గరకు రావచ్చు' తల్లికి నచ్చ చెప్పటానికి ప్రయత్నించేడు ఆదిత్య.

పది రోజులు పది నిమిషాల్లా గడిచిపోయేయి. ఎప్పటిలా 'సారీ' చెప్పి ఆదిత్య భార్య, కొడుకుతో పాటు ట్యాక్సీ ఎక్కుతున్నప్పుడు మునుపటిలా భారతికి దుఃఖం మాత్రం రాలేదు.

సంగతి తెలిసిన దీప్తి ఫోను చేసి, 'అమ్మా! నువ్వు బాధపడకు. మీరిద్దరూ నా దగ్గరకి వచ్చి ఉండండి. ఈ సంవత్సరం తరువాత నా పెద్దకొడుకు 'కిరణ్'ని నీ దగ్గరకి పంపిస్తాను. వీడు అక్కడ నీ దగ్గర ఉండి చదువుకుంటాడు. నాకు చిన్నవాడు 'వరుణ్' ఉన్నాడు కదా!' ఓదార్పుగా చెప్పింది.

'ఒద్దులే దీప్తీ! నాకు ప్రస్తుతం దేనికీ బాధ అనిపించటం లేదు. మళ్లీ నీ కొడుకుని చదివించటం, పెద్ద చెయ్యడం, వాడు వెళ్లిపోవటం-ఇవన్నీ ఎందుకమ్మా? ఇలా చెప్తున్నందుకు ఏమీ అనుకోకు. రేపు నీ జీవితంలో కూడా ఇలా జరగవచ్చు. అందుకే ముందుగా ఈ బంధాలూ, అనుబంధాలూ పెంచుకోకు. వాళ్లని కన్నందుకు పెంచి పెద్ద చెయ్యి. ఏది చదువుతానంటే అది చదివించు. నీ మాట వినలేదని దేనికీ బాధపడకు. మాకు ఎప్పుడు మిమ్మల్నీ, మనుమల్నీ చూడాలని అనిపిస్తే అప్పుడు తప్పకుండా వస్తాం...

కూతురు సమాధానానికి ఎదురుచూడకుండా ఫోను పెట్టి ఎప్పటిలా నిద్ర కోసం మంచం ఎక్కింది భారతి. ●

అత్తగారు ఇచ్చిన పట్టుచీర, డైమెండ్ సెట్టు చూసి గాభరాగా మొహం పెట్టింది కీర్తి. 'అబ్బా! ఆంటీ, అసలే వేసవి కాలం. ఇవన్నిటినీ వేసుకోలేను. చీర అసలు నాకు అలవాటు లేదు కూడా. అయినా డ్రెస్సులో పూజ చేస్తే మీ దేవుడు ఏమీ అనడు కదా ఆంటీ?'